కథానిక

# వాడిపోయిన పువ్వు

కొమ్మూరి పద్మావతీదేవి

సిరిసంపదలతో మంచి ఉన్నత స్థితిలో ఉన్న శర్మకి ఒక్కత్తే కూతురు. లలితకి పద్ధెనిమిదేళ్లు. అట్టే అందచందాలు లేకపోయినా తీర్చినట్టు చూడముచ్చటగా మాత్రం ఉంటుంది. తల్లికి నవనాగరిక పద్ధతులూ ఎక్కువ చదువులూ యే మాత్రం ఇష్టంలేదు. ప్రతీ రోజూ ఇంట్లో పోరు పెట్టి భర్తచే చీవాట్లు తింటూనే ఉంటుంది. శర్మకి కూతురు విషయమై కోటలుదాటే ఆలోచనలు. అన్ని విద్యలూ లలితకి రావాలని విదేశాలకి కూడా పంపి ఇంకా చాలా చదివించాలని.

లలిత పరీక్షలలో మంచి పట్టాలు పొంది మోటారు నడపటంలో కూడా మొగవాళ్లని మించిన పేరు సంపాదించుకుంది.

కూతురికి వచ్చిన సంబంధాలు శర్మకి నచ్చలేదు. లలితని మించిన వరుడు కావాలని ఆశ. ఇరవైయెనిమిదేళ్లు నిండినా లలితకి పెళ్లి కావటం చిక్కు సమస్య అయింది. ఆ రోజు సాయంకాలం తండ్రీ కూతురూ షికారు తిరిగి వచ్చారు.

"చూడండీ! అన్నయ్య ఒక అబ్బాయిని పంపాడు, మా పిన్ని ఆడబోడుచుకి దగ్గరవాడట. ఇబ్బందులో ఉన్నాడు. వాడికి ఏదైనా దారి మనం చూపితీరాలి."

"బాగుంది. మనం ఏం చెయ్యగలం?"

"పోనీ నాన్నా ఉండనీ. కారుకి డ్రైవరు కావాలనుకుంటున్నామా, నేర్పిస్తాను."

శంకరం లావుగా గుండ్రంగా తెల్లగా ఉంటాడు. నవ్వితే మాట్లాడితే ఏదో వెకిలితనం. ఆ కాసేపు అతనివైపు చూడలేనంత వెగటుగా ఉంటాడు. శర్మ ఇంటికి వచ్చిన ఆరు నెలలకే ఇంట్లో అందరికీ పనిలో మంచివాడని అనిపించుకున్నాడు. ఎవరికీ ఇయ్యని ఇనపపెట్టె తాళాలు కూడా శంకరం చేతికి శర్మ ధైర్యంగా ఇచ్చేవాడు. ఇంట్లో ఒక మనిషిగా అందరి ఆదరణా పొంది డ్రైవరు లైసెన్సు పొందాడు శంకరం.

లలితకి వీలులేనప్పుడు శంకరం కారు నడపాలి. తల్లీ కూతురూకి శంకరం అంత నమ్మకస్తుడూ తెలివిగలవాడూ లేడని శర్మకి నూరిపోశారు.

30 ఏళ్లు దగ్గరగా వస్తున్నా లలితకి పెళ్లి కాలేదనే విచారం శర్మకి పట్టుకుంది. "నే చెబితే విన్నారా! దేనికైనా వయసు దాటితే యింక ఇంతే!" అనే మాటలతో అతని బాధ ఎక్కువ అయి పైకి నవ్వుతూ తిరుగుతున్నా లోలోపల కృశించటం కూతురు గ్రహించింది. ఒక రోజు సాయంత్రం మామూలుగా తండ్రీ కూతురూ బయలుదేరి చాలాదూరం నడిచారు.

"చూడు లలితా! ఇంకెన్నాళ్లు నేను ఉంటానో నాకే భయంగా ఉంది. తలుచుకుంటే ఏ నిమిషానన్నా నా గుండె ఆగిపోవచ్చు."

"ఏమిటి నాన్నా! ఈవాళ ఈ మాటలు."

"అవునమ్మా, నీ విషయమై నాకు పుట్టెడు బెంగ. నిన్ను ఒక ఇంటిదాన్ని చెయ్యలేదు. నా మాట కాదనకపోతే ఒకటి చెప్తాను వింటావా?"

"నీమాట ఎప్పుడన్నా కాదన్నానా. నీ మనసులో ఎవరన్నా ఉంటే చెప్పు?"

"ఆఁ అదే...అందుకే, ఎవరున్నారూ, శంకరాన్ని చేసుకుంటే తప్పు ఏముంది?"

"ఏమిటీ? నాన్నా..." అంటూ తల కిందికి వాల్చింది లలిత. తండ్రి లలిత భుజంమీద చెయ్యివేసి "నీకు ఇష్టం లేకపోతే ఇలాగే వుండు. ఇకమీద నీకు పెళ్ళి కావటం కష్టం. ఇతనికి చదువు తక్కువగాని మన దూరపు బంధువు, మంచివాడు. నిన్ను సుఖపెడతాడు" అంటూ కర్ర నేలమీదకొట్టి కళ్లజోడు సవరిస్తూ రోడ్డువైపు చూసి ముందుకు నడిచాడు. రోజూ తండ్రితో సమంగా నడిచే లలిత తండ్రి వెనకనే నడుస్తూ ఆలోచనలతో ఇల్లు చేరింది.

తండ్రీ కూతుళ్లు వీధి గుమ్మంలో అడుగు పెట్టగానే శంకరం నవ్వుతూ ఎదురుపడి లలితచేతికి స్క్రీ_ను అందించాడు. అతని ముఖం చూడలేక తలవంచుకుని పైకి వెళ్ళిపోయింది లలిత.

రెండు రోజు లయింది. మళ్ళీ పెళ్లి సంగతి తండ్రిఎత్తకపోవటంలలితకి ధైర్యంకలిగించింది.శర్మ లలిత మౌనం అంగీకారంగా భావించి ఆ సాయంత్రం లలిత లేకుండా చూసి శంకరంతో కారులో బయలుదేరాడు శర్మ. రోజూ కారులోనే ఉండే శంకరాన్ని తనతో తీసుకువెళ్ళి దగ్గరగా కూచో పెట్టుకుని అతి ఆప్యాయంగా, "చూడుశంకరం: నువ్వునాకుఅన్ని విధాలా చాలమంచివాడివి అయి పోయావు, మా లలితను నీకు ఇవ్వటానికీ, పై నెలలో పెళ్ళిచేయటానికీ నిశ్చయించాము. మీ వాళ్ళకి వ్రాసెయ్యి, నా మాట కాదనకు"అంటూ గబగబా ఆయాసపడుతూ అతని ముఖంలోకి చూశాడు.

శర్మని చూసేధైర్యంలేక తెల్లబోతూ శంకరం నిలబడ్డాడు.

"లలితను అడిగాను, ఇష్టపడింది. ఇంక నీ మాటమీదే కావాలి అన్ని పనులూ."

"నాకా పెళ్ళి. దమ్మిడీ సంపాదనలేని నాకు, వద్దు" అంటూ గొణిగాడు శంకరం. ఎలాగో అతన్ని ఇంటికి చేరాడు శర్మ. లలిత చాలా ఆలస్యంగారావటం శర్మకి బాగాలేకపోయింది. ఏమని అడగటానికి నోరురాలేదు. పెళ్ళి కాదని అను కున్న లలితకి పెళ్ళి నిశ్చయం అవటం, అందులోనూ తనవైపు వాడు అల్లుడు కావటం లలిత తల్లికి చాల సంతోషంగా ఉంది.

శంకరం ఇదివరలాగాక సూటు బూటుతో తిరుగుతూ అల్లుడి పోజులో బెట్టుగా తిరుగుతున్నాడు. లలితమాత్రం ఏ పనులూ అతనికి చెప్పడంలేదు. ఆమెకి కావలసినవన్నీ అలవాటు ప్రకారం శంకరం చేస్తూనే ఉన్నాడు. పెళ్ళికి బంధువులు ఇల్లంతానిండిపోయారు. శర్మ హడావిడిగా అటూఇటూ తిరుగుతూ పెండ్లిపందిట్లో పనులు పురమాయిస్తున్నాడు. శంకరం ట్వీడు సూటుతో సిగరెట్టుపొగ వదులుతూ ఠీవిగా నిలబడడానికి ప్రయత్నిస్తున్నాడు.

"చూడు లలితా! నువ్వు రానన్నావు మరి బజారంతా గాలిస్తే ఇంతమాత్రం దొరికింది చూడు ఎలా ఉందీ" అంటూ రవ్వల గొలుసు లలిత మెళ్ళో వేసింది తల్లి. లలిత చుట్టూఅంతా చేరి "నీ మెడకి ఎంత బాగుందే"అన్నారు.

తెల్లార గట్ట లగ్నానికి పెళ్ళి వైభవంగా జరిగింది. సాయంత్రం టీపార్టీకి వచ్చినజనానికి పందిరి చాలలేదు. ఉన్నత ఉద్యోగస్థులు, స్నేహితులు తెచ్చిన బహుమతులు లలితపక్క_న రాసులుగా నిండిపోయాయి. శంకరం పక్క_న సోఫాలో జరీతో నిండిన మెరుపుచీరలో ముడుచుకుని వెల వెలబోతూ కూచుంది లలిత. ఎప్పుడూ నవ్వుతో ఉండే ఆ ముఖంలో అంతమార్పు శర్మకి చాలా బాధకలిగించింది గాని లలితకి దగ్గిరగా వెళ్ళి పలకరించే ధైర్యం లేకపోయింది.

ఎప్పుడూ సరదాగా కబుర్లు చెబుతూ తండ్రి తండ్రికూడా తిరిగే లలిత ఇప్పుడు తన గదివిడిచి బయటికి రావడం మానేసింది. శంకరానికి గాని శర్మకిగాని అటు వెళ్ళి పలకరించే దమ్ము లేక పోయింది. లలిత అంత గంభీరముగా మౌన ముద్రతో రోజులు గడుపుతూంది.

"చూడమ్మా లలితా! ఇవాళ నా చిన్ననాటి స్నేహితుడు, అతని కుటుంబం వస్తున్నారు. ఈ ఊరికి కమీషనరుగావస్తున్నాడు. నువ్వు ఇంట్లోనే ఉంటావుకదూ?"

"ఇంట్లోఉండక ఎక్క_డికి పోతాను"అంటూ పైకి వెళ్ళిపోయింది లలిత.

ఆ సాయంత్రం కమీషనరు వెంకట్రావు భార్యా, కొడుకూ కారుదిగారు. శర్మ, శంకరం లోపలికి పిలుచుకువచ్చారు.

కుశల ప్రశ్నలు అయాక ఫలహారాలు అందించింది లలిత.

"ఎంతో ప్రయత్నించాం పెళ్ళికిరావటానికి"

"నువ్వు రానికోరత అలాగే ఉండిపోయింది. సుధ ఏం చదువుతున్నాడు?"

"ఏం చదువున్నాడేమిటి! నీకు నే వ్రాయనే లేదా. లండన్ వెళ్ళివచ్చి మూడు నెలలు అయింది ఇక్క_డే కలక్టరుగా దిగాడు. అందుకేగా మేం రావటం మరి."

"అరె! వి. ఎస్. రావు అంటే ఇతనా? నువ్వు రిటైరు అయావన్నమాట, అలాగా?"

సుధా, లలితా అనేక విషయాలు మాట్లా

డారు. లలిత వాక్చాతుర్యం ఆమె చదువూ విని వెంకటరావు సంతోషపడ్డాడు.

శంకరం అటుపక్కగా రాక పనివున్నట్టు నటిస్తూ సెలవుతీసుకుని బయటికి వెళ్లాడు. తరచు రెండిళ్ళకీ రాకపోకలు హెచ్చిపోవడం, లలిత, సుధాకర్ కబుర్లు చెప్పుకోటం అలవాటయి పోయాయి. "మీరుఉభయులూ రేపు ఆదివారం సినీమాకి రావాలి"అన్నాడు సుధాకర్ శంకర్‌ని చూసి, లలితని అడగలేక ఆమెవైపు చూశాడు శంకరం.

వస్తామని మాట ఇచ్చింది లలిత. సుధాకర్ అటువెళ్ళగానే మొట్టమొదటసారి శంకరాన్ని పలకరించింది లలిత. "సినీమావేళ మరువవద్దు" అన్నది నవ్వుతూ. శంకరానికి ఆమె ఆ రోజు దేవకన్యలా కనిపించింది.

పెళ్ళి అయిన ఆర్నెల్లకి అమె తనను పలక రించటం సినీమాకి పిలవటం. ఆ ఆనందం పట్ట లేక మనిషి ఖంగారు పడిపోయాడు.

ముగ్గురూ సినీమాలో కూచున్నారు.

శంకరం నోరు మెదపలేదు. లలిత ఏమం టుందో మళ్ళీ తనను ఏంపిలుస్తుందో అని వెయ్యి కళ్ళతో అమె వెనకాలే చూస్తున్నాడు.

శంకరం లలిత కారు దిగగానే సుధాకర్ నవ్వుతూ, "ఉండండి మీ చీరకొంగు" అంటూ తలుపు మళ్ళీతీసి, లలిత వంగి కొంగుతీసుకుంటూ ఉంటే, "రానంటూందా?"అన్నాడు.

ఇద్దరూ ఒక్కసారిగా నవ్వారు. కొంచెం ముందుగానిలబడిన శంకరం తనూ నవ్వాలనుకుని రానినవ్వు తెచ్చుకున్నాడు.

"సుధాకర్ మనింటికి మరీవస్తున్నాడు. ఆలో చించండి."అన్నది లలిత తల్లి రహస్యంగా.

"ఇంటికివస్తే ఏమయిందీ. ఇద్దరూ బాగా చది విన వాళ్లు. ఒకరికిఒకరు తీసిపోరు. నీకేం తెలుసు. ఉత్త ఆడారి మాటలూ."

"అవునులెండి. నాకెందుకూ" అంటూ లోప లికి వెళ్లబోతూ కారు ఆగినట్లయి వెనక్కి తిరిగి చూసింది.

"లలితమ్మగారికి ఈ ఉత్తరం యిచ్చి బదులు తెమ్మన్నారు"అన్నాడు డ్రైవరు.

"అమ్మాయీ! లలితా." అన్నది శర్మవంక కోపంగా చూస్తూను. లలిత మెట్లు దిగివచ్చి ఉత్తరం చదువుకుని నవ్వుకుంటూ పైకివెళ్లి ముస్తా బయి వచ్చింది.

"ఎక్కడికేమిటీ"అన్నాడు శర్మ.

"సుధ రమ్మని వ్రాశాడు. ఒక కేసు విషయం చెప్పాలని, మళ్లీ వెళ్లిపోవాలిట."

"ఇక్కడుకే రావచ్చుగా"అంటూన్న తండ్రి మాటలు వినిపించుకోకండా సుధాకర్ కారు ఎక్కి వెళ్ళిపోయింది లలిత. కారు కదిలాక వీధి గుమ్మంలో నిలుచుని ఆలోచిస్తున్నాడు శంకరం.

ఆరోజున దీపావళి అల్లుడూ-కూతురూ కొత్త బట్టలు కట్టుకున్నారు. పండగ బాగా జరిగింది. లలితమాత్రం ఎందుకో చాలా చిరాకుగావుంది. సాయంత్రం ప్రమిదలలో దీపాలు వెలిగిస్తూంది తల్లి, మామూలుగా శంకరం ఆమెవెంటనే వుండి అన్నీ అమర్చి అందిస్తున్నాడు. లలిత కాశ్మీరు పట్టుచీర కట్టుకుని తలనిండా పువ్వులతో వన కన్యలా తోటలోకివెళ్ళి పచార్లు చేస్తూంది.

"ఊరంతాతిరగటానికి వెళదామా"అన్నాడు శర్మ లలితని పిలుస్తూ.

"నే రాలేనబ్బా" అంటూ లలిత వీధివైపే చూడటం తల్లి గ్రహించింది.

ఇంతలో కారులోంచి వెంకట్రావూ, భార్యా దిగారు. లలితకళ్లు సుధాకర్ కోసం వెతికాయి. అందరూ కులాసాగా పండగ ముచ్చట్లు చెప్పు కుంటూ, "మా సుధాకర్ పెళ్లి పైనెలలో" అన్నాడు వెంకట్రావు.

"ఏమిటీ! చెప్పావుకావూ. ఏ ఊరూ?"

"నాకేం తెలుసు, ఎవరినో ప్రేమించాట్ట. మనవాళ్లు కాదు నాయుళ్లు."

"నిజంగా! మీరు ఒప్పుకున్నట్టే?"

"ఒప్పుకోక. వాడి సుఖంకన్నా మాకేం కావాలి. మీరంతా రావాలి."

లలిత పరధ్యానంగా కాఫీ కొత్తచీరమీద ఒలకపోసుకుంది. శంకరం తన చేతిరుమాలుతో తుడుస్తూ ఆమె దగ్గిరగా వంగాడు. లలిత పూసు కున్న సువాసనలు, తల్లో పూవులు అతణ్ణి పర వశుణ్ణి చేశాయి. లలిత దగ్గిరగా ఆనుకొని కూచోటం తల్లి చూస్తూ, "ఇంతకీ పెళ్ళికొడుకు ఏడీ" అన్నది.

"ఎయిరోప్లేనులో ప్రేయసిదగ్గరికి వెళ్ళాడు." అన్నాడు వెంకట్రావు వక్కపొడి వేసుకుంటూ.

అంతా వెళ్ళాక ఒంటిగా నిలబడిన లలిత భుజంమీదచెయ్యివేశాడు శంకరం. లలిత ఉలిక్కిపడి వెనక్కి వెళ్ళింది. శంకరం మరీదగ్గిరగా వెళ్లి నడుం చుట్టూ చెయ్యివేసి దగ్గిరగా తీసుకోబోయాడు. ఎర్రబడిన ముఖంతో కోపంగా ఒక పరుగున మేడమెట్లు యెక్కి పక్కమీద పడి పోయింది. చీకటిగా ఉన్న ఆ గదిలోకి వెళ్ళి తలుపువేశాడు. లలిత అతనివైపుచూసి భయంతో వణికిపోయింది. ఆ చీకటిలో అతని కళ్లు నిప్పుకణాల్లాగా మెరుస్తున్నాయి. శంకరం తనవైపే రావటం చూసి, లలిత గోడమూల ఒదిగి నిలబడింది, శంకరం మాటామంతీ లేకుండా లలితని తనవైపు గట్టిగా లాక్కున్నాడు.

ఇద్దరికీ జరిగిన ఘోరమైన పోట్లాటలో గదిలోని వస్తువులన్నీ చిందరవందర అయాయి. తల్లీ, తండ్రీ ఎంతపిలిచినాఇద్దరిలో ఒక్కరూపలకలేదు.

అర్థరాత్రి నిశ్శబ్దంగా ఉన్న ఆ గది తలుపులు తెరచుకోవటం వెయ్యికళ్లతో కనిపెట్టుకునివున్న తల్లి చూసింది. రక్తమయమైన గుడ్డలతో శంకరం రావటం చూడగానే ఆమె కెవ్వుమని అరిచింది. రక్తపు మడుగులో పడివున్న లలితని చూడలేక శర్మ ఏడుస్తూ కళ్లు మూసుకున్నాడు.

అప్పటికీ ఇప్పటికీ ఆ ఇంట్లో మిగిలినవాళ్ళు ఏమయ్యారో తెలియదుగాని, ప్రతీ దీపావళికీ ఆ ఇంట్లో ఉన్నవాళ్లు మాత్రం భయపడిపోతారు.

తల విరబోసుకుని కాశ్మీరపు పట్టు చీరెతో పాలరాతి విగ్రహం తోటంతా తిరుగుతుందనీ గేటు వాకిట్లో నిలబడి అలా కదిలిపోతుందనీ అంటారు.

దీపావళి పండుగమాత్రం ఆ ఇంట్లో ఇప్పటికీ ఎవ్వరూ చేసుకోలేరు.

---

స్కెచ్

# "కైంకర్యస్వామి"

ఓగేటి శివరామకృష్ణ

కైలాసపట్టణ వాసులకు కైంకర్యస్వామి యిలవేల్పు. ముష్టివాని దగ్గరనుంచి, కోటికిపడగలెత్తిన ధనవంతులవరకూ కైంకర్యస్వామియందు భక్తిశ్రద్ధలు కలిగియుంటారు. ఏవేవో మొక్కులు మొక్కుకుంటూ ఉంటారు కూడాను. అయితే కైంకర్య స్వామియందు వారికుండే భక్తిశ్రద్ధలు నానాటికి తమకోర్కెలు కొంచెం ఇంచుమించుగా నెరవేరుతూండటంవల్ల, అభివృద్ధి పొంగుతున్నాయిగాని సన్నగిల్లటంలేదు. ఇదంతా కేవలం ఆగ్రామవాసుల అదృష్టమేకాకుండా, ఆ దేవుడియొక్క అదృష్టమేమో కూడా.

కైంకర్యస్వామిని సేవించటం, ఉడతాభక్తితో కాయో కసురో దేవునికందించి తృప్తిపడటం, ఉత్తచేతులతోపోయి, ఒకకానీదక్షిణవేసి, అంతకు సగిపోయే ప్రసాదాన్ని పొందటం మరి ఆకానీ యైనా ధర్మంచేయకుండా పోయి, ప్రసాదంకోసం రెండుమూడు మార్లు చేతులుచాచి, సరుకుమూట కట్టడం, ఆ పట్టణవాసుల్లో రకరకాల మనుష్యుల విద్యుక్త ధర్మం! ఈలాంటి భక్తులు వారంతా!

మరి అసలు విషయంలోకి వద్దాం. కైలాస పట్టణవాసుడు, నల్లబజారున అధికలాభములు గణించిన అపరదేశభక్తుడూ అయిన లంబోదర స్వామికి కైంకర్యస్వామిమీద హఠాత్తుగా చెప్పలేని అనురాగం పుట్టుకొచ్చింది. లంబోదర స్వామికి శ్రీస్వామిమీద యెడతెగని అనురాగం పుట్టుకొచ్చినందుకు విజ్ఞులే వింతపడుతూంటే మన మేపాటివాళ్ళం? మీరే నిర్ణయించండి.

నల్లబజార్లో అధికలాభాలు యెంతోకాలం నుంచి పొందుతున్నా లంబోదరస్వామి మాత్రం యింతక్రితం అంతా తన ప్రయోజకత్వమే అన్నట్లుగా, యెవరయినా లంబోదరయ్య ప్రయోజకత్వాన్ని పొగడుతూ, ఆ భగవంతుని లీలలు వర్ణించుతూంటే, ఆయన మాత్రం కళ్లెర్రచేసేవాడు! "అంతా తన స్వశక్తివల్లననీ, తనవల్లననీ" ఆయన ఒకప్పటి అభిప్రాయం. "ఆ,'అదేంమాట. అదృష్టమంటూ ఉంటే మనల్ని దేవుడేంచేస్తాడు. బాగుపడితే అదృష్టమనుకోవాలి. దెబ్బతింటే కర్మ మనుకోవాలి" అనేవాడు.